క్లుప్తంగా

సూపర్ చెక్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక



సర్వే చేస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: సూపర్ చెక్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. శనివారం మండలంలోని బోరిగామలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో భాగంగా సూపర్ చెక్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారుల ఎంపిక తర్వాత గృహ నిర్మాణ శాఖ ద్వారా నిధులు మంజూరు కాగానే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించుకోవాలని పేర్కొన్నారు.

శుభ్రత పాటించాలి



వంట గది పరిశీలిస్తున్న ఎంపీడీవో

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాల్లో శుభ్రత పాటించాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శనివారం మండలంలోని వాగ్దారి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. వంట గదులను శుభ్రంగా ఉంచాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా పోషకాహారం అందించాలన్నారు. అలాగే వంట చేసే సమయాల్లో పాటించాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రత గురించి వివరించారు. ఆయన వెంట అంగన్‌వాడీ టీచర్ కవిత, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలతో పాటు నాగోబా విద్యాలయం విద్యార్థులకు ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో శనివారం పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పుర్క చిత్రు మాట్లాడుతూ.. విద్యార్థులకు తమవంతు సహాయంగా పెన్నులు, ప్యాడ్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. తుడుందెబ్బ నాయకులు జుగ్నాక్ భరత్, సోయం రాందాస్, గేడం భారత్, సోయం మురారి పాల్గొన్నారు.

సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పి.రవీందర్ కుమార్‌ను ఆదిలాబాద్ ట్రావెల్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. జిల్లా కేంద్రంలోని రవాణాశాఖ కార్యాలయంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసిన పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ట్రావెల్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి శౌకత్, అభుబకార్, పాషా, ఉరడే సుభాష్, సాధిక్, అజీమ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

గుండెపోటుతో బీఆర్‌ఎస్ నాయకుడు మృతి



రమేశ్ (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రోకండ్ల రమేశ్ శనివారం హఠాన్మరణం చెందారు. జైనథ్ మండలం మాండగడ గ్రామానికి చెందిన ఆయన శనివారం వేకువజామున గుండెపోటు రావడంతో కుటుంబీకులు హుటాహుటిన జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే జోగు రామన్నతో పాటు పలువురు వివిధ పార్టీలకు చెందిన నాయకులు సంఘీభావం తెలిపారు. 1989లో జైనథ్ మండల ఎంపీపీగా పనిచేశారు. 1995లో మున్సిపల్ చైర్మన్‌గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. రెండు సార్లు జైనథ్ జెడ్పీటీసీగా కాంగ్రెస్ తరపున పోటీ చేసి జోగు రామన్న చేతిలో ఓటమిపాలయ్యారు. 2022లో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడిగా నియమాకమయ్యారు. ఆయనకు భార్య మినాక్షి, కూతురు, కుమారుడు ఉన్నారు.

ఎంపీ పరామర్శ



రాజేశ్వర్ రెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ నగేశ్

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి చెందిన రాజేశ్వర్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండటంతో శనివారం ఎంపీ నగేశ్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన నర్సయ్య, చాబంతుల శంకర్ ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబాలను పరామర్శించారు.

తలమడుగు: మండలంలోని వివిధ గ్రామాలలో ఇటీవల మరణించిన బాధిత కుటుంబసభ్యులను శనివారం మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్ పరామర్శించారు.

వారధికి అనుమతుల అడ్డు

- అటవీ అనుమతులు లేక నిలిచిన పనులు
- గిరిజనులకు తప్పని కష్టాలు



నిలిచిన కోండాపూర్ వంతెన పనులు

సిరికొండ: ప్రతీ ఏడాది వరదలు రావడం వంతెనకు ఉన్న అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది. దీంతో ప్రమాదకరంగా వాగు దాటే పరిస్థితి నెలకొంది. మళ్లీ కొన్ని రోజులకు తాత్కాలికంగా మొరం వేయడం జరుగుతుంది. ఇలా మండలంలోని కోండాపూర్ గిరిజనుల కష్టాలు ఎన్నో ఏళ్లుగా ఉంటునే ఉన్నాయి. వాగుపై నూతనంగా 249 మీటర్లతో సుమారుగా కోటి నలభై లక్షలతో 2021లో వంతెన మంజూరు చేసింది. దీంతో గిరిజనుల వరద కష్టాలు తప్పుతాయని ప్రజలు అనుకున్నారు. కానీ ఇప్పటి వరకు ఆ కష్టాలు మాత్రం తీరలేదు.

అటవీ అనుమతులు లేక..

చిక్‌మాన్ వాగుపై వంతెన మంజూరు చేయడంతో వంతెన పనులు కూడా ప్రారంభం అయి పూర్తయ్యే దశకు కూడా చేరుకుంది. కానీ వాగు చివర్లో మూడు పిల్లర్లు వేశారు. వాటికి అటవీ శాఖ అనుమతులు లేవని అధికారులు పనులు నిలిపివేశారు. దీంతో మూడు పిల్లర్లు వేసి దానిపై స్లాబ్ వేయడం మరిచారు.

అధికారులకు వినతులు..

వంతెన పనులు పూర్తయితే సిరికొండ మండల వాసులకే కాకుండా ఇంద్రవెల్లి మండలంలోని పలు గ్రామాల ప్రజలకు కష్టాలు దూరం అవుతాయి. అటవీశాఖ అనుమతులు లేక మూడు పిల్లర్లు వాటిపై స్లాబు, అప్రోచ్ రోడ్డు పనులు నిలిచిపోయాయి. సదరు కాంట్రాక్టరుతో పాటు మండల ప్రజాప్రతినిధులకు, అటవీశాఖ అధికారులకు, కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేసినా.. ఎలాంటి ఉపయోగం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన పనులు పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎలాంటి అడ్డు లేదు

కోండాపూర్ వంతెన నిర్మాణంలో అటవీ శాఖ నుంచి ఎలాంటి అడ్డు లేదు. వంతెన పనులు పూర్తి చేసుకోవచ్చు. అటవీ శాఖ పూర్తి అనుమతులున్నాయి. సదరు కాంట్రాక్టరు పనులు పూర్తి చేయాలి.

– ప్రశాంత్ బీబీ పాటిల్, జిల్లా అటవీశాఖ అధికారి

పనులు పూర్తి చేయాలి



కోండాపూర్ వంతెన పనులను వెంటనే పూర్తి చేయాలి. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని వంతెన పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలి. పనులు పూర్తయితే ప్రజల కష్టాలు తీరుతాయి.

– గులబ్ సింగ్, ధర్మసాగర్

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బజార్‌హత్నూర్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి భక్తులు నిర్వహించిన అయ్యప్ప శోభాయాత్ర, పడిపూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మేకల వెంకన్న, చట్ల గజ్జాయ్య, గురుస్వాములు బిట్లింగు లక్ష్మన్, పండరి, చట్ల ఉత్తం, గోవర్ధన్, నరేందర్, మల్లేష్ పాల్గొన్నారు.

సొనాల ప్రజల కలను సాకారం చేశాం

బోథ్: సొనాలను మండలంగా ఏర్పాటు చేయాలని ఇక్కడ ప్రజల ఆకాంక్షను మాజీ సీఎం కేసీఆర్ నెరవేర్చారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాలయాల ఏర్పాటులో తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. ఎంపీడీవో రమేశ్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌తో కలిసి మండల కార్యాలయాల కోసం భవనాలను పరిశీలించారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, హాస్టల్ భవనాలను పరిశీలించారు. మాజీ సర్పంచ్ చెట్లపెల్లి సదానందం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మణ్ సింగ్, భీంరావ్ పాటిల్, చిలుకూరి నరేందర్, చిన్నయ్య పాల్గొన్నారు.

రైతులకు నిరంతర విద్యుత్ అందించండి

- విద్యుత్ అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే
- విద్యుత్ సీఈతో కలిసి బోథ్ సబ్‌స్టేషన్ పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని విద్యుత్ అధికారులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశించారు. బోథ్ సబ్‌స్టేషన్ పరిధిలో గత వారం రోజులుగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో రైతులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ‹అప్రకటిత విద్యుత్ కోతలు› అనే శీర్షికన సాక్షిలో ఈ నెల 4వ కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్పందించారు. ఎమ్మెల్యేతో పాటు సీఈ జేఆర్ చౌహాన్, సబ్ స్టేషన్‌ను శనివారం పరిశీలించారు. బోథ్ సబ్ స్టేషన్‌లో అదనంగా నూతనంగా 5ఎంఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులను పరిశీలించారు. మరో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపినట్లు పేర్కొన్నారు. వీలైనంత త్వరగా నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ రైతులకు త్రీఫేజ్ విద్యుత్‌ను అందించాలని ఆదేశించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న టోల్‌ప్లాజా కార్మికులు

నేరడిగొండ: టోల్‌ప్లాజాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, కిరణ్‌లు అన్నారు. శనివారం కామారెడ్డిలోని ఎన్‌హెచ్ఏఐ పీడీ శ్రీనివాస్‌కు ఉమ్మడి జిల్లాలోని టోల్‌ప్లాజా కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోల్‌మామడ, గంజాల్, పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా పరిధిలో 240 మంది కార్మికులు గత 15 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. నిర్వహణలో మార్పులు జరిగిన దానికి అనుగుణంగా కార్మికులందరిని యథావిధిగా కొనసాగించాలన్నారు. ప్రమాద బీమా రూ.50 లక్షలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నక్క లక్ష్మణ్, సంతోష్, రమేశ్, టోల్‌ప్లాజా కార్మికులు పాల్గొన్నారు.

ఎదులాపురం: నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా పరిధిలోని టోల్ ప్లాజాలలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్న మొల్లకిరణ్ డిమాండ్ చేశారు. శనివారం కామారెడ్డిలోని ఎన్‌హెచ్ఏఐ ప్రైమరీ ఇంప్లిమెంటేషన్ యూనిట్‌లో పీడీ శ్రీనివాసరావుకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కంపెనీల గుత్యాధిపత్యం పెరిగి కార్మికులను ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. కార్యక్రమంలో బొజ్జ ఆశన్న, అగ్గిమల్ల స్వామి, నక్క లక్ష్మణ్, సంతోష్, రమేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

బేల: శనగ పంటలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి సాయితేజరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సాంగిడి రెవెన్యూ గ్రామ శివారులోని శనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగ పంటకు ఎండు తెగులు ఆశించిందన్నారు. నివారణకు 3గ్రా. కాపర్ ఆక్సి క్లోరైడ్(లేదా) 10గ్రా. ట్రైకోడర్మావిరిడ్‌ను 1లీటర్ నీళ్లలో కలిపి మొక్కల మొదళ్లలో డ్రెంచింగ్ చేయాలని సూచించారు. ఏఈవో వినయ్‌కుమార్, రైతులు నితిన్, సుధాకర్, అకాష్, తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వర్ సేవలు మరువలేనివి

తలమడుగు: జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల సుంకిడిలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు రామేశ్వర్ సేవలు మరువలేనివని డీఈవో ప్రణీత అన్నారు. శనివారం మండలంలోని సుంకిడి గ్రామంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో అంకితభావంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ స్వామి, ఉపాధ్యాయులు రామ్‌రెడ్డి, సుకుమార్ పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని పలు బంగారు విక్రయ దుకాణాల్లో దొంగతనాల నియంత్రణకు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దొంగతనాలు జరుగకుండా పాటించాల్సిన జాగ్రత్తలతో ముద్రించిన కరపత్రాలను షాపు యజమానులకు అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్స్ వంశీ, లింబన్న పాల్గొన్నారు.

5వ తరగతి ప్రవేశాలకు ఆహ్వానం

బోథ్: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

బోథ్: రోడ్డు నిబంధనలు పాటించాలని నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పొచ్చెర క్రాస్‌రోడ్డు వద్ద గల సెయింట్ థామస్ పాఠశాలలో రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా విద్యార్థులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఆర్టీసీ సిబ్బంది రాజన్న, రాజేశ్వర్ రెడ్డి, సాయన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్

కైలాస్‌నగర్: ఉపాధి పథకం అమల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేలా ప్రతిఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి రాథోడ్ రవీందర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీటీడీసీ సమావేశ మందిరంలో ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లతో జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు చేపట్టిన పనుల ప్రగతిపై మండలాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల వారీగా చేపట్టాల్సిన పనుల ప్రణాళికలను సిద్ధం చేసి నివేదికలు అందజేయాలని తెలిపారు. దివ్యాంగులకు కూలీ గిట్టుబాటు అయ్యే పనులను చూపించాలన్నారు. సమావేశంలో ఏపీడీలు కుటుంబరావు, కృష్ణారావు, విజిలెన్స్ అధికారి రాజేశ్వర్, అంబుడ్స్‌మెన్ వీణా, ఏవో గంగాధర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అందించాలి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించినప్పుడే మేలు జరుగుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 21 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్య సేవలు అందకపోవడంతో కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. వైద్యం కోసం రూ. లక్షల్లో ఖర్చవుతుందని ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తులు పెట్టుకుంటే రూ.20 నుంచి రూ. 30 వేలు ఇస్తున్నారన్నారు. వైద్యం కోసం ఆస్పత్రిలో చేరిన వారికి పూర్తి సాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల ప్రవీణ్, రఘుపతి, కృష్ణయాదవ్ శ్రీనివాస్, రాందాస్, దయాకర్, సంజు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నేరడిగొండ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని టీ డబ్ల్యూఆర్‌జేసీ బుగ్గారం బాలికల పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి అన్నారు. ఈనెల 2న హైదరాబాద్‌లో జరిగిన సీఎం కప్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పూజ అనే విద్యార్థిని కాంస్య పతకంతో పాటు రూ.10 వేల నగదు గెలిచింది. గతనెల 29న బెల్లంపల్లిలో నేషనల్ యోగా, కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో కె.మీనాక్షి బంగారు పతకం, ఆర్.అక్షర రజత పతకం, అనూష కాంస్య పతకం, కరాటే పోటీల్లో అఖిల, బిందు, సాయిప్రియ, దివ్య రజత పతకాలను సాధించారు. దీంతో శనివారం ఆ పాఠశాలలో ఉపాధ్యాయ బృందం, పీఈటీలు మమత, గంగామణిలు, సిబ్బంది విద్యార్థినులను అభినందించారు.

క్రీడా నైపుణ్యం పెంపొందించాలి



బహుమతులు అందజేస్తున్న సీఐ

నార్నూర్: గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేలా క్రీడా పోటీలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సీఐ రహీంపాషా అన్నారు. శనివారం మండలంలోని ఖైర్దాట్వా గ్రామంలో శ్రీ అంజనేయ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో సీఐ పాల్గొన్నారు. గెలుపొందిన జట్లకు బహుమతులను క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామపటేల్ నారంజీ పటేల్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు, మాడవి తుకారాం, మాడవి జైవంతరావు, జాలిన్ షావ్ పాల్గొన్నారు.

సబ్ పోస్టాఫీసు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బేల: బేలకు సబ్ పోస్టాఫీసు మంజూరు చేయాలని బీసీ సంఘం మండల అధ్యక్షుడు గోరే విశాల్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కొట్నాక రఘునాథ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేలలో సబ్ పోస్టాఫీసు లేకపోవడంతో పోస్టల్ ఆర్డీ ఖాతాలు, డిపాజిట్‌లు, విత్‌డ్రాలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. సీసీఐ పత్తి విక్రయాల చెల్లింపులు, సోయా విక్రయాల చెల్లింపుల కోసం ప్రతినిత్యం రైతులు అవస్థలు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బేలలో సబ్ పోస్టాఫీసు లేకపోవడంతో పింఛన్ నగదు, ఉపాధి కూలీల నగదు చెల్లింపులు, పోస్టల్ సేవలు ఆలస్యమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో బేల పట్టణ అధ్యక్షుడు ఉప్పల్‌వార్ కార్తీక్, అమ్రేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: యువత మత్తుకు దూరంగా ఉండాలని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాస్ అన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని విద్యార్థి కళాశాలలో మాదకద్రవ్యాల ప్రభావం వల్ల కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం డ్రగ్ నిర్మూళలపై రూపొందించిన పోస్టర్ ఆవిష్కరించారు. వ్యసనాలకు అలవాటు పడితే శరీరకంగా, మానసికంగా అనేక సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ సుశీల్ బడ్, అశోక్, రవీందర్, పురుషోత్తం రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి



పూజలు చేస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

తలమడుగు: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. శనివారం మండలంలోని బరంపూర్‌లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. అనంతరం శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సర్వేను వేగవంతం చేయాలని, అర్హులైన ప్రతీ ఒక్కరి వివరాలు సేకరించాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ రాజ్‌మోహన్, పంచాయతీ సెక్రటరీ అనిల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే సంపూర్ణ జ్ఞానం



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: పుస్తక పఠనంతోనే సంపూర్ణ జ్ఞానాన్ని అలవడుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హై స్కూల్లో రామకృష్ణ సేవా సమితి వివేక జాగృతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. మానవ విలువలను పెంపొందించడానికి పుస్తకాలు ప్రేరణ కలిగిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మయూర్, ఆదినాథ్, ముకుంద్, సేవాసమితి పాల్గొన్నారు.

సిరికొండ: పిల్లల్లో పుస్తక పఠనం అక్షర సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని ఎంఈవో సునీల్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల్లో రూమ్ టు రీడ్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎంపీపీఎస్, ఎంపీయూపీఎస్ పాఠశాల టీచర్లకు శిక్షణ తరగతులతో పాటు గ్రంథాలయ నిర్వహణపై శిక్షణ నిర్వహించారు. రీడ్ రూమ్ ప్రతినిధి విజయ్, ప్రధానోపాధ్యయులు గంగారాం, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

పెంచిన పింఛన్ ఇప్పిస్తానని మోసం

నేరడిగొండ: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూ.4వేలకు పెంచిన పింఛన్ ఇప్పిస్తానని ఓ వృద్ధురాలి వద్ద నుంచి రూ.2వేలు తీసుకొని ఉడాయించిన ఘటన శనివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని తేజాపూర్ గ్రామానికి చెందిన మెట్‌పల్లి భూమా అనే వృద్ధురాలు మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్‌కు పింఛన్ కోసం వచ్చింది. అక్కడ పింఛన్ తీసుకున్న తర్వాత కిరాణ షాపుకు సామగ్రి కోసం వెళ్లగా అక్కడికి గుర్తు తెలియని వ్యక్తి వచ్చి పోస్టాఫీస్ సార్లు రమ్మంటున్నారని నమ్మబలికి అక్కడికి తీసుకెళ్లాడు. కొత్త పింఛన్ రూ.4వేలు నీకు వచ్చాయని చెప్పి ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకొని వచ్చి వృద్ధురాలి నుంచి రూ.2వేలు తీసుకొని రూ.4వేలు పోస్టాఫీస్ అధికారులు ఇస్తారని, అక్కడ కూర్చోవాలని చెప్పి వెళ్లిపోయాడు. ఎంతసేపటికి అక్కడికి రాకపోవడంతో అక్కడే ఉన్న కొందరిని అడగగా మోసం జరిగిందని తెలుసుకుంది. దీంతో ఆమె కన్నీటిపర్యంతమైంది.